# వెదురు

## వి. రాజారామమోహనరావు

నేలమీదకి దిగొచ్చి నిలబడ్డ నల్లటి మబ్బులా వున్నాడు గంగన్న అసలే మనిషి నల్లటి నలుపు దానికి తోడు గన్నేరు చెట్టు నీడలో వున్నాడేమో మరింత నల్లగా కనపడ్డాడు ప్రయాణం హడావిడిలో వున్న ఆనందరావుకి

పిలుపు విని బయటికొచ్చిన ఆనంద రావుని చూడగానే "టౌను కెల్తున్నారా" అన్నాడు గంగన్న గొంతు మొద్దుగా కాకపెట్టటానికి ముందు డప్పు చప్పుళ్ళా వుంది

అవునన్నట్టు తలూపాడు ఆనందరావు

అన్ని పల్లెల్లాగే ఆ పాలెం కూడా చాలా అవసరాలకి దగ్గర్లో వున్న టౌనుమీద ఆధారపడి వుంది. ఊళ్ళో ఎవరికి ఏ అవసరం వచ్చినా టౌను కెళ్ళేవాళ్ళకి చెపుతుండటం రివాజు గంగన్నకి టౌనులో ఏం అవసరం వచ్చిందో ఆనందరావు వూహకందలేదు

"మీరు బైల్దేరండి బస్సుకెళ్ళైంది రోడ్డుదాకా నేనూ వస్తా" అన్నాడు గంగన్న ఆనందరావు తయారయి ఇంటికి తాళం వేశాడు

ఇద్దరూ కలిసి నాలుగడుగు లేశారు. నలభై ఇళ్లు దాటారు అప్పటికీ గంగన్న నోరు కదపలేదు చివరకి ఆనందరావే అడిగాడు "సంగతేమిటి గంగన్నా" అని

"మరేం లేదండి" అన్నాడు గంగన్న ముందు. అని మరో అడుగు పడ్డాక. "అదేనండి మావోడు. నారిగాడు. వారం రోజుల్నించి కాపట్టం లేదండి." అన్నాడు

గంగన్న కొడుకు నారాయణ వారం రోజులుగా స్కూలుకి రావటంలేదన్న సంగతి అప్పుడు గుర్తొచ్చింది ఆనంద రావుకి

"ముందు కంగారుపడి మనూరంతా ఎతికానండి టౌనుదాకా ఎల్తాడనుకో లేద రాత్రి మన పెద్ద పంతులుగారికి టౌనులో లక్ష్మీటాకీసు కాడ కనిపించాడం టండీ అసలు నేనే బైలుదేరి టౌను కెడదామనుకున్నాను పంతులుగారే వొద్దన్నారు నారిగాడెందుకో బెదిరిపోయాడు ఆడితో నెమ్మదిగా మాట్లాడి మంచీ చెడూ ఎవరేనా తెలుసుకుంటే మంచిదన్నారండీ" అన్నాడు గంగన్న ఇద్దరూ వూరుదాటి నాగులడొంకదాకా వచ్చారు డొంక దాటితే రోడ్డు ఎండ కొద్దికొద్దిగా పెరుగు తోంది.

"మీరు ఎలాగేనా వోసారి ఆడిసంగతి

చూపిరండి. ఆడెళ్ళిన దగ్గర్నుంచీ మా పెద్దది తిన్నగా కూడు తింటం లేదండీ ... తమ్ముడూ, తమ్ముడూ అని వొకటే గోల. ఆళ్ళమ్మ పోయినకాణ్ణించీ అదే తల్లిలా పెంచిందండాడ్ని." అన్నాడు గంగన్న. ఆత్రుతని, బాధని బలవంతంగా అదుపులో పెట్టుకుంటున్నట్టుంది గంగన్న గొంతు.

"ఇల్లొదిలి ఎందుకెళ్ళిపోయాడు. ఏమేనా చెయిచేసుకున్నావా." అన్నాడు ఆనందరావు.

"అబ్బే లేదండీ. ఆణ్ణెవరం ఏం అనలేదండీ. ఎందుకెళ్ళిపోయాడో.... ఏంటో తెలియకుండా వుంది." అన్నాడు గంగన్న.

గంగన్న ముఖంచూస్తే జాలేసింది ఆనందరావుకి. సాధారణంగా వూళ్ళో ఎవరితోటి ఎక్కువగా మాట్లాడ్డు గంగన్న. మరీ తప్పనిసరైతే జంకుతూ మాట్లాడతాడు. దానికి తోడు ఇప్పుడు తండ్రి మనసు తాలుకు బాధ.

తప్పనిసరిగా లక్ష్మీటాకీసు దగ్గరకెళ్ళి నారాయణని కలుసుకుని విషయమేమిటో కనుక్కుంటానని చెప్పాడు ఆనందరావు. అయినా ఒకటికి రెండుసార్లు ఆనందరావు ఆ విషయంలో భరోసా ఇచ్చేవరకు తృప్తి పళ్ళేదు గంగన్న. పెద్దపంతులు ద్వారా విన్న వివరాలు, నారాయణ వున్న చోటు గుర్తులు ఆనందరావుకి పదేపదే చెప్పాడు.

అప్పటికే రోడ్డుమీద చింతచెట్టుకింద అయిదారుగురు బస్సుకోసం ఎదురు చూస్తున్నారు. నెమ్మదిగా వాళ్ళదగ్గరికి నడిచాడు ఆనందరావు. అసలే ప్రయాణమంటే చిరాకు. దానికితోడు బస్సెప్పుడొస్తుందో తెలియదు. వచ్చిన బస్సు ఆగుతుందో లేదో తెలియదు.

"పొద్దున్నేలకదండీ. కాయగూరాళ్లతో నిండిపోయుంటది. కార్ల చిట్టిగాడితో చెపుదామాండీ .." అన్నాడు గంగన్న.

ఆ దరిదాపులో వున్న అయిదారు పల్లెల్నించి పొద్దునే కూర తీసుకుని టౌను కెళ్ళి వ్యాపారం చేసేవాళ్ళెక్కువ. అందువల్ల పొద్దున్న బస్సులు రద్దీగా ఉంటాయి. ఆ విషయం ఆనందరావుకి తెలుసు. గంగన్నమాట విన్నాక కార్ల చిట్టితో చెప్పడమే మంచిదనిపించింది. అక్కడి టీ బడ్డీలోనే వుంటాడు వాడు. వాడికీ కార్ల వాళ్ళకీ మంచి కాంటాక్ట్సు ఉన్నాయి. ఎంత రద్దీగా వున్నా బస్సెక్కించగలడు వాడు. పోతే వో రూపాయి ఫీజివ్వాలి.


గంగన్న వెళ్ళి కార్ల చిట్టితో చెప్పొచ్చాడు. వాడు సరేనన్నట్టు టీ బడ్డీలోంచే ఆనందరావు వేపు చూస్తూ సైగచేశాడు.

చెప్పాల్సిందంతా అయిపోయినట్టు చేతులు కట్టుకు నిలబడ్డాడు గంగన్న. ఆనందరావుకేం తోచక దిక్కులూచాశాడు. చెట్టుకిందవాళ్ళలో నలుగురు కూరగాయల వాళ్ళు. నలుగుర్లో ఇద్దరాడాళ్ళు. మోకాళ్ళ పైదాకా కచ్చాపోసి కట్టారు. 'బస్సు రావటం ఆలిశ్యం' అన్నట్టు కొంగులు బిగించి నిలబడ్డారు.

అనుకోకుండానే ఆనందరావు కళ్ళు చూస్తున్నాయి. నున్నటి బలమైన వొళ్లు. నల్లగా నిగనిగలాడే పిక్కలు. మోటు పనులవల్ల వుబ్బి గట్టిగా వున్న పాదాలు. వెండి కడియాలు. ఇంకా చూపులు పైపైకి పాకుతుంటే బలవంతంగా తల తిప్పు

కున్నాడు. వయసు తాలూకు కోరిక ఎంత కాదనుకున్నా నేనూ వున్నానంటోంది ఆనందరావులో. ముప్పై దాటుతున్న వయసు. కోరిక తెలిసిన ఆనందరావు ఆలోచనకి అప్పుడే పదేళ్ళు పైపడ్డాయి.

చదువయ్యాక నాలుగేళ్ళు నిరుద్యోగంతో బాధపడి చివరికి యీ పల్లెటూళ్ళో టీచరుద్యోగానికి వచ్చా



డు. ఇది దొరకటమే మహాభాగ్యమనిపించింది. చేరింతర్వాత ఇబ్బందులేమిటో తెలిసొచ్చాయి. పల్లెటూళ్ళో టీచరంటే, అందులో మేనేజిమెంటు స్కూల్లో మాస్టరుద్యోగమంటే పిల్లలకి పాఠాల్చెప్పటం ఒక్కటే కాదని తెలియటానికి, ఎన్నాళ్ళో పట్టలేదు ఆనందరావుకి.

రాజకీయపు పార్టీలు .. కులాల పార్టీలు ..అంతస్థుల పార్టీలు....అని పార్టీల నుంచీ వేరుగా వుంటూ....ఊళ్ళోని పెద్దమనుషుల ముందు అనేకరకాల కప్ప దాట్లు దాటుతూ బతకటం మహా ఇబ్బందిగా వుంది. ఎవరికి ఏ క్షణంలో ఏం తిక్క-

పుడుతుందో ఎప్పుడు వుద్యోగం వూడుతుందో అన్న అనుమానం అనుక్షణం ఆనందరావులో కదుల్తూనే వుంది. అందుకని యీ వుద్యోగం భరోసాతో పెళ్ళి విషయం ఆలోచించటం అనవసరం అని నిర్ణయించుకున్నాడు.

ఆలోచన ఆడతనం మీదకి, కోరిక మీదకి మళ్ళినప్పుడల్లా ఆనందరావులో చిరాకు మరింత పెరుగుతోంది. గాలిరాని గదిలోపెట్టి బంధించిన జంతువులా వుంటోందతనికి.

"బస్సొస్తోందండీ... " అని గంగన్న చెప్పేవరకు ఆలోచనల్లోంచి తేరుకోలేదు ఆనందరావు. కార్ల చిట్టికూడా రోడ్డుమీద కొచ్చాడు.

ఆనందరావు బస్సెక్కాక.... "మళ్ళీ ఎప్పుడొస్తారండీ తిరిగి ." అనడిగాడు గంగన్న.

"రేపు సాయంత్రం ." అన్నాడు ఆనందరావు.

"నారిగాడికెలాగేనా సెప్పి ఎంటెట్టుకు రండి. ఆడొచ్చేవరకు మాకు కూడొంటట్టదు." అన్నాడు గంగన్న బస్సు కదుల్తుండగా.

ఆనందరావు 'సరే' నన్నట్టు తలూపాడు.

బస్సు రద్దీగా వుంది. ఓ పావుగంట తర్వాత బస్సులో ఓ చిన్న వూరు దగ్గర ఆగాక ఆనందరావుకి సీటు దొరికింది. బైటకి చూస్తూ కూచున్నాడు.

పచ్చటి పొలాలు, కాలవ. కాలవలో గేదెల్తో కలిసి చిన్నపిల్లల దిగంబర స్నానాలు. ఒక్కొక్కటే కదుల్తూ వెనక పడుతున్నాయి. ఉన్నట్టుండి బస్ స్పీడ్ తగ్గింది. ఎవరిదో శవం. డప్పుల మోత.

అది చూడగానే తిరిగి గంగన్న గుర్తొచ్చాడు ఆనందరావుకి. ఎనిమిదినెలల క్రితం పాలెంలోకి మొదటిసారి అడుగు పెట్టినప్పుడు నాగుల డొంకదగ్గర ఎదురొచ్చాడు గంగన్న. ఊళ్ళోకి దారి అదేనా అని అడిగి మునసబుగారిల్లు అడిగాడు ఆనందరావు. గంగన్న కూడా వుండి మునసబుగారిల్లు చూపించాడు. దార్లో వాడు మాట్లాడినవి రెండే మాటలు.

"నన్ను మాదిగ గంగన్నంటారండి." అని చెప్పుకోటం.


"మీ ఇళ్ళోనే మా నారిగాడు సదూతూన్నాడండీ " అంటం. ఆ రకంగా పాలెంతాలూకు మొదటి పరిచయస్తుడు గంగన్న. ఆ తర్వాత గంగన్న పనిపాటల గురించి తెలిసింది. చావులకి, దండోరాలకి డప్పుకొడతాడు. ఖాళీ సమయంలో చెప్పులు కుడతాడు. గొడ్డూగోదా పోతే వాటి ఆఖరిప్రయాణం చేయించు సొంతదారుల ఇబ్బంది తగ్గిస్తాడు. ఇదీ గంగన్న బతుకు.

ఆ తర్వాత చాలాసార్లు గంగన్నని చూశాడు ఆనందరావు. ఎప్పుడు చూసినా నిరుత్సాహంగా కనిపించేవాడు. ఏనాడూ గంగన్న సంతోషంగా నవ్వగా చూళ్ళేదు ఆనందరావు.

ఎప్పుడో మాటల సందర్భంలో ఎవరో చెప్పగా తెలిసింది ఆనందరావుకి దాని క్కారణం. భార్య బతికున్న రోజుల్లో గంగన్నకి, ఈ గంగన్నకి పోలికే లేదని. గంగన్న భార్య చావుకి కారణం ఇదంటూ

## సుభాషితాలు

వివేకం కలవాడెప్పుడూ క్షమార్పణ కోరదు. —ఎమర్సన్




వో కథ కూడా ప్రచారంలో వుంది. ఎవరో కామందు బలవంతంగా లోబరుచుకున్నాడని, ఆ తర్వాత జీవితంలో సద్దుకోలేక మంచమెక్కి తీసుకుని, తీసుకుని పోయిందని, కాదు ఏదో మింగిందని దానివల్లే కోలుకోలేక పోయిందని, ఏది ఏమైనా భార్యపోయాక గంగన్న పూర్తిగా జంకిపోయాడు.

ఇప్పుడు గంగన్న ప్రపంచం చీకటి పడేసరికల్లా రెండు ముంతల కల్లు. వాడి కూతురు, కొడుకు.

గంగన్న సంగతంతా గుర్తొచ్చాక అశ్రద్ధ చెయ్యకుండా నారిగాడి సంగతి కనుక్కోవాలనుకున్నాడు ఆనందరావు. పన్నెండేళ్ళవాడు ఇల్లొదిలేసి అంతదూరం పారిపోయాడంటే ఏదో బలమైన సంఘటనే జరిగుంటాలనుకున్నాడు ఆనందరావు.

* * *

తన పనులు చూసుకుని ఆనందరావు లక్ష్మీటాకీసు దగ్గరకెళ్ళేటప్పటికి రెండో ఆట మొదలైంది. గంగన్న చెప్పిన గుర్తుల ప్రకారం వెతుక్కుంటూ టీకొట్టు చేరాడు. సినిమా హాలుకి పందగజాల్లో వుంది. నారిగాడి గురించి అడిగితే ...

“ఎవడు నల్లగా, సన్నగా ఉంటాడు. చీకిరికళ్ళు .. వాడేనా .” అన్నాడు, చిన్న రాగి బాయిలర్ ముందు నిలబడి టీ కలుపుతున్నతను. అవున్నన్నట్టు తలూపాడు ఆనందరావు. కొట్టుకి అతనే యజమాని కాబోలు అనుకుంటూ.

లోపల కప్పులు తీస్తున్న కుర్రాడివేపు తిరిగి “మన నల్లోడురా” అన్నాడు అతను.

"కూచోండి బైటికి టీ పట్టికెళ్ళాడు. వచ్చేస్తాడు." అన్నాడు.

లోపల గోడలవారగా మూడు పొడు గాటి చెక్కబల్లలున్నాయి. బాయిలర్‌కి పక్కగా వున్న టేబుల్ మీద వో పెద్ద సిల్వర్ బేసిన్‌లో జంతికలు, మరో బేసిన్‌లో మిరపకాయ బజ్జీలు వున్నాయి. వాటి పక్కగా గాజు అద్దాల పెట్టెలో బన్‌రొట్టెలున్నాయి.

ఓ బల్ల చివరగా కూచున్నాడు ఆనంద రావు.

"టీ తాగుతారా" అన్నాడు బాయిలర్ మనిషి.

'అక్కర్లేదన్నట్టు' తలూపాడు ఆనంద రావు.

కొట్టుకి ఆనుకునే పెద్ద మురిక్కాల వుంది. ఎవరేనా కొట్లోకి రావాలంటే దాన్ని దాటేరావాలి. కొట్లో అయిదారుగురు టీలు తాగుతూ గట్టిగా మాట్లాడుకుంటు న్నారు. యాభై అరవై మంది కలిపి అరిచినట్టుంది వాళ్ళ సంభాషణ. మిరప కాయ బజ్జీలు తింటూ విరివిగా బూతులు నంజుకుంటూ టీ తాగుతూ

"ఆ లక్ష్మి తిన్నగా వుండదు కానీ... డబ్బులు మటుకు తెక్కావాలిరా ..." అంటున్నాడు వొకతను.

"మీ ప్రొప్రయిటర్ మరో బెంజి కొన్నాడటగా." అంటున్నాడు ఇంకొ కతను.

మురిక్కాలవ ముక్కులు బద్దలు చేస్తోంది. 'వాళ్ళందరికీ అలవాటైపోయి వాసన తెలియటం లేదులా వుంది . .' అనుకున్నాడు ఆనందరావు.

వచ్చి పావుగంటైనా నారిగాడి జాడ లేదు. ఇంక వుండబట్టలేక "వాడు రావటానికి ఇంకా బాగా ఆలిశ్యమవు తుందా ..." అనడిగాడు ఆనందరావు కొట్టతన్ని.

"వచ్చేయాలండీ. ఒకోసారి అక్క డోళ్ళు ఆలిశ్యం చేస్తారు డబ్బులివ్వ టానికి. కుర్రాణ్ణి పంపి పిలిపించమంటారా" అన్నాడు.

ముందు 'సరే' అందామనుకున్నాడు ఆనందరావు. ఎవరో వచ్చారని తెలిస్తే నారిగాడు అసలు రాకపోవచ్చని అను మానం వొచ్చి.

"కుర్రాణ్ణి పంపండి. కూడా నేనూ వెడతాను." అన్నాడు.

"అబ్బే మీరెళ్లే చోటు కాదులెండి. కుర్రాడెళ్ళి పిలుస్తాడు" అంటూ లోపల బల్లలు తుడుస్తున్న కుర్రాణ్ణి పిలిచాడు.

ఆనందరావు పరవాలేదని ఒకటి రెండుసార్లు అన్నాక వొప్పుకున్నాడు కొట్టతను.

ఆ కుర్రాడు కొట్టుకి ఎడంచేతివేపుగా వున్న సందులోకి తీసుకెళ్ళాడు. పెద్ద వెలుగ్గాలేదు సందు. పెంకుటిళ్ళు పాకలు కలగాపులగంగా వున్నాయి. ఇంచుమించు అన్ని ఇళ్ళల్లోనూ లైట్లు వెలుగుతూనే వున్నాయి.

"మీరిక్కడే వుండండి. నేచూసొస్తా" అంటూ కుర్రాడు వోయింట్లో కెళ్ళాడు. వెళ్ళిన ఇంట్లోంచి వెంటనే తిరిగొచ్చి . "ఇక్కడలేదండీ ఆ ఇల్లు చూద్దాం రండి" అంటూ మరో పెంకుటింటివేపు నడిచాడు. చీకటి.. .గుమ్మాల దగ్గర ఆడాళ్ల తార ట్లాటం .ఆ సందు వాతావరణం కొంత వరకు గ్రహింపుకొచ్చింది ఆనందరావుకి.

## సుభాషితాలు

నడచినా పరుగెత్తినా నౌకలో వెళ్ళినా ఎవరు మాత్రం ఎక్కడకు పోగలరు? ఎవరూ తమ స్వభావాల నుంచి ఎడంగా పోలేరు. —శ్రీశ్రీ




ఆనందరావు ఆ ఇంటి ముందు కొచ్చేటప్పటికి ఏదో రిక్షా కదిలి వెళ్ళిపోయింది. గుమ్మంవరకూ వచ్చిన ఆ మనిషి "రండి రండి" అంటూ ఏదో గొణిగింది. ఆనందరావు కూడా వున్న కుర్రాడు.

"ఆయన అందుక్కాదులే మీకుటీలు తెచ్చే నల్లోడికోసం వచ్చారు" అన్నాడు.

ఆనందరావు బలవంతంగా అణిచి పెడుతున్న కోరిక వొక్కసారి స్వల్పంగా స్పందించింది. ఒక్కుదుటున ప్రవాహంలా బుర్రలోకి ఏవేవో వూహలు తోసుకొచ్చాయి. తటపటాయిస్తూ మెట్లదగ్గరే నిలబడ్డాడు.

లోపలకెళ్ళిన కుర్రాడు తిరిగొచ్చాడు "నల్లాడొస్తున్నాడండీ" అంటూ.

లోపలనుంచి ఏవేవో మాటలు వినిపిస్తున్నాయి. నారిగాడు నత్తలా లోపలి గదిలోంచి నడుచుకుంటూ వొస్తున్నాడు. చేతిలో ఖాళీ గ్లాసులున్నాయి. సరిగ్గా వాడు వీధిలోకి రాబోతుండగా లోపల్నించి పరిగెత్తుకుంటూ వొచ్చింది అంతకు ముందు ఆనందరావుని పిలిచిన మనిషి.

"వొరే నల్లోడ అరిజంటుగా మంచి టీ రెండు బజ్జీలు పట్రా ఆలిసంచెయ్యకు" అంది.

సరే అంటూ వచ్చేయబోయాడు నారిగాడు.

"ఎప్పుడూ అలాగే అని గంటక్కాని రావు. ఇప్పటికే ముగ్గురయ్యారు. ఇవాళ గిరాకీ బావుంది. ఇంకొక మడిసి కూచు

మన్నాడు. నీరసం వొస్తోంది తొందరగా రాయే" అంది.

ఆనందరావు వొళ్ళు వొక్కసారిగా చల్లబడింది.

పని హడావిడిలో ఖంగారుగా టీ తాగే రిక్షా వాళ్ళలాగా, లారీ వాళ్ళలాగ వీళ్ల కూడా వోపిక్కోసం .ఇంక ముందుకి సాగలేదు. ఆనందరావు ఆలోచన.గబగబా చాలా విషయాలు గుర్తొచ్చాయి. వాటిలో తిన్నగా రిఖాణాలేని తన బతుకు ...పెళ్ళి ...రోజు రోజుకి వొళ్ళు పెంచుకుంటున్న కోరిక. యీ చీకటిసందు ఈ వాతావరణం లోనా నారిగాడుంటున్నది అనుకున్నాడు.

"మీరా మాస్టారు." అని నారిగాడు అనేవరకు ఆనందరావు తేరుకోలేదు.

"నేనేలే రా" అంటూ ముందుకి నడిచాడు.

ఇద్దరూ టీకొట్టు దగ్గరికొచ్చారు. నారిగాడితో కాస్సేపు మాట్లాడేపనుందని కొట్టతనితో చెప్పి వెంటపెట్టుకుని సినిమా కేంటిన్‌లోకి తీసికెళ్లాడు.

టిఫెన్ తెప్పించి నారిగాణ్ణి తిన మన్నాడు ఆనందరావు. వాడు కట్టుకున్న బట్టలు బాగా మాసిపోయాయి. టీమరక ల్తోటి అలుగ్గుడ్డలా వున్నాయి. వంచిన తలెత్తకుండా తింటూ కూచున్నాడు.తలెత్తి


అరుణా

# ఆంగ్ల భాషా స్వబోధిని

## అరువది రోజులలో ఆంగ్లభాషను అభ్యసించండి

తెలుగు తెలిసిన వయోజనులు, స్త్రీలు టీచరు సహాయము లేకుండానే ఇంటి వద్దనే వుండి ఇంగ్లీషు నేర్చుకోవడానికి, మా "అరుణా ఆంగ్ల భాషా స్వబోధిని" కల్పతరువు వంటిది. మీ స్నేహితులతో ఇంగ్లీషులో మాట్లాడుకోవడానికి, ఉత్తర ప్రత్యుత్తరములు జరుపుకోవడానికి, ఇంకెన్నో మీకు కావలసిన విషయాల్ని గురించి ఇందులో బొమ్మలతో సహా చక్కని తేలికైన ఉదాహరణలు వున్నాయి. మీ ఆంగ్ల భాషా విజ్ఞానము నిర్దుష్టంగాను, ధారాళంగాను వుండేందుకు వీలుగా పూర్తి [illegible] పొందుపరచబడివుంది. హైస్కూలు విద్యార్థులకు కూడా ఇది మిక్కిలి ఉపయోగకరమైనది:

త్రివర్ణ ముఖచిత్రముగల జాకెట్‌తో—క్యాలికో బైండు.—సుమారు 700 పేజీలు

**వెలః రూ. 10-00. పోస్టేజి రూ. 2-75. నేడే మీ కాపీకి M. O. చేయండి.**

V. P. P పద్ధతి లేదు!


**SREE ARUNA BOOK HOUSE (J)**

**1/48, Narayana Mudali St., MADRAS-1**

సుభాషితాలు

కొందరు మనసుంచి విమర్శ కోరుతారు కాని, వారికి కావలసింది పొగడ్త.

—మామ్




ఆనందరావు వేపు చూళ్ళేకపోతున్నాడు.

"మీనాన్న ఏమైనా అన్నాడేరా." అన్నాడు నెమ్మదిగా ఆనందరావు.

లేదనట్టు తలూపాడు నారిగాడు.

"మరి ఎందుకు పారిపోయొచ్చినట్టు." అనడిగాడు.

ఆనందరావు ఒకటికి రెండుసార్లు అడిగినా నారిగాడేం బదులు చెప్పలేదు. నెమ్మదిగా నచ్చచెప్పి అనేక రకాల భరోసా యిచ్చాక అరగంటకి నెమ్మదిగా నసుగుతూ చెప్పాడు.

"నాకు భయం వేసిందండీ" అని నెమ్మదిమీద నారిగాడు చెప్పిన వివరాలు విన్నాక ఆనందరావుకి ఆశ్చర్యంవేసింది.

"అలా శావాలకూడా డప్పువాయించటం నాకు బయమండి. అయ్యకి ఎన్ని సార్లో చెప్పాను. ఇనడు. 'బయమేంటిరా కూడా నేను లేను.' అని తిట్టి తీసికెడుతున్నాడండి." అన్నాడు

"పోనీలే నిన్ను డప్పువాయించటానికి తీసికెళ్ళద్దని మీ నాన్నకి నేను గట్టిగా చెపుతాను రా మనూరెళ్ళిపోదాం. హాయిగా చదువుకుందువుగాని" అన్నాడు ఆనంద రావు.

ఏమైనాసరే రానన్నట్టు తల అడ్డంగా వూపాడు నారిగాడు. వాడిలో భయం బాగా పాతుకుపోయిందని గ్రహించాడు ఆనంద రావు. బలవంతంపెట్టి తీసికెళ్ళినా ప్రయోజనం వుండేలా తోచలేదు.

"టీలు మోసే ఈ పనేం బావుందిరా.

శుభ్రంగా చదువుకునే వయసునీది. అసలు చదువుకోవాల్నిలేదా." అన్నాడు ఆనంద రావు.

"చదువుకుంటానండి కానీ మనూరు రాను." అన్నాడు నారిగాడు.

"సరేలే మనూరు రావద్దులే కానీ నే చెప్పినట్టు చేస్తావా." అన్నాడు ఆనంద రావు.

'సరే' అన్నట్టు తలూపాడు నారిగాడు.

బిల్లుకట్టేసి నారిగాడితో కలిసి టీ కొట్టు వేపు నడిచాడు ఆనందరావు.

* * *

మర్నాడు సాయంత్రం పాలెం తిరి గొస్తున్న ఆనందరావుకి తృప్తిగా వుంది. ఆ పసివయసులో, అటువంటి దారుణమైన వాతావరణంలో చీకటి సందులో నలుగు తున్న నారిగాడి జీవితాన్ని మరోదారికి మళ్ళించగలిగినందుకు ఆనందంగా వుంది. అన్నింటికన్నా తను చేసినపనికి గంగన్న మురిసిపోతాడని తలుచుకోగానే ఎంతో హాయి అనిపించింది ఆనందరావుకి. ఈ రకంగానేనా గంగన్న ముఖంలో సంతో షం చూడచ్చు అనుకున్నాడు. ఉత్సా హంలో గంట ప్రయాణం అరగంటలా తోచింది ఆనందరావుకి. పాలెంలో బస్సు దిగుతుండగానే ఎదురుగా గంగన్న కని పించాడు. ముఖంలో ఆతృత కొట్టొచ్చి నట్టు కనిపిస్తోంది. ఆనందరావు బస్సు దిగినా. మునిగాళ్ళ మీద లేచి బస్సంతా కలయచూస్తున్నాడు గంగన్న.

"నారిగాడికోసమేనా వాడు రాలేదు గంగన్నా." అన్నాడు ఆనందరావు. అయోమయంగా చూశాడు గంగన్న ఆనందరావువేపు.

"అయినా వాడికేం పరవాలేదు. అన్ని ఏర్పాట్లు చేసొచ్చాను చెపుతాను పద." అన్నాడు అయిష్టంగానే ఆ బస్సుని వొదల్లేనట్టే చూస్తూ ఆనందరావుతో నడిచాడు గంగన్న.

ఇద్దరూ నాగుల డొంకచేరే లోపల వివరాలన్నీ చెప్పాడు ఆనందరావు. నారిగాడి భయానికి కారణం. వాడు చేస్తున్నపని,వాతావరణం అన్నీ చెప్పాడు.

"వాణ్ణిప్పుడు బలవంతంగా తీసుకొచ్చి వుపయోగం లేదు గంగన్నా అందుకని టౌన్లో నా స్నేహితుడు నాలాగే మాస్టరు వున్నాడు. అతని దగ్గర వుంచాను. అతనూ వొండుకుతింటున్నాడు వోకుర్రాడి అవసరం అతనికీ వుంది. నారిగాణ్ణి మన కన్నా జాగ్రత్తగా చూసుకుంటాడు. అక్కడే స్కూల్లో చేరుస్తాడు. నువ్వేం బెంగపెట్టుకోకు. ఇక్కడి గొడవల్లోకన్నా అక్కడే శుభ్రంగా చదువుకోని" అన్నాడు ఆనందరావు.

అన్నీ విన్నాక గంగన్న ముఖం మరింతగా మాడిపోయింది తప్ప ఏ మాత్రం ఆనందం కనపడలేదు. ఆనంద రావు అడక్కముందేనెమ్మదిగా చెప్పాడు.

"అదిపోయిన కాడ్నించి పిల్లల్ని సూసుకునే బతుకుతున్నాను బాబు.ఇప్పుడు ఈడూ దూరమైపోయాడు." అన్నాడు.

నిండుగా నీళ్ళు దాచుకున్న మబ్బులా వుంది గంగన్న ముఖం.

"అలా ఇదైతే ఎలా గంగన్నా. నారి గాడు చదువుకుని బాగుపడుతున్నందుకు

సంతోషించక ఇలా బాధపడితే ఎలా." అన్నాడు.

"ఏం చదువో బాబు. అడు నాకు దూరమైపోయాడనే కాదు బాబు. ఈ చదువులమీద నమ్మకం ఏంటి బాబు. మునసబుగారబ్బాయి, సౌదరీగారబ్బాయి అంతపెద్ద చదువులు చదివి మనూళ్ళో వూరికేతిరగటంలా, సదువుకున్నాళ్ళందరూ ఎంత సుఖపడుతున్నారో మీకు తెలవదా బాబు." అన్నాడు గంగన్న.

ఆనందరావుని కొరడాతో కొట్టినట్టు వులిక్కిపడ్డాడు ఆ మాటలకి. "తనూ చదువుకున్నాడు. తన బతుకు సుఖంగా వుందా." ఇంకా ఆనందరావు ఆలోచన ముందుకి సాగకముందే.

"అందుకనే బాబూ ఆడు బయమన్నా డప్పు వాయించటం నేర్పుదామనుకున్నా చెప్పులు కుట్టటం నేర్పుదామనుకున్నా ఏదో పని చేతిలోవుంటే ఎక్కడో అక్కడ గంజినీళ్ళైనా తాగుతాడు." అన్నాడు గంగన్న తిరిగి.

ఆనందరావుకి ఏమంటానికీ తోచలేదు. గంగన్నకి ఎలా నచ్చ చెప్పాలో తెలియ లేదు.

ఇంకా ఎంతమంది తల్లి తండ్రులకి పిల్లల చదువుల విషయంలో ఇలాంటి బెదురుందో అనిపించింది. వోదార్పుగా గంగన్నకి ఏవేవో చెపుదామనుకున్నాడు. కానీ గొంతు పెగల్లేదు.

చదువుని వుద్యోగంకోసం. బతుకు తెరువు కోసమేకాకుండా విజ్ఞాన సాధనంగా జీవితంలో చాలా సమస్యల్ని ఎదుర్కొనే ఆలోచనకి అవసరమైందానిగా గంగన్న ఆలోచించలేదని ఆనందరావుకి తెలుసు.

చివరికి ఎలాగో నానాయాతనాపడి అనేక రకాలుగా గంగన్నకి నచ్చచెప్పాడు. ఊళ్ళోకి వచ్చేదాకా చెపుతూనే వున్నాడు. గంగన్న సమాధానమేం చెప్పలేదు. తప్పనిసరై వొప్పుకున్నట్టు తలాడించాడు తప్ప....

ఆనందరావు ఇంటిదగ్గర కొచ్చేవరకు ఇద్దరూ అలా మాట్లాడుతూనే వున్నారు.

అక్కడ ఆనంధరావుని వొదిలి వెళ్ళే ముందు నెమ్మదిగా తలెత్తి "ఎల్తానండి" అని దణ్ణం పెట్టాడు గంగన్న. గంగన్న వేపు చూస్తూ సరేనన్నట్టు తలూపాడు ఆనందరావు.

అన్ని రకాలుగా ధైర్యంగా చెప్పినా గంగన్న కళ్ళల్లో ఇందాకటి బెదురు పూర్తిగా తొలగలేదన్నది స్పష్టంగా కనపడింది ఆనందరావుకి.

ప్రోగ్రెస్ అవుతున్న సొసైటీలో నమ్మకం పెరగాలి ధైర్యం పెరగాలి. కానీ బెదురు అనుమానం పెరుగుతున్నా యనిపించే టప్పటికి గంగన్నకన్నా ఎకు వుగా కుంగిపోయాడు ఆనందరావు.

